# ఐదేండ్ల భవిష్యత్తును నిర్ణయించేది ఓటు

- ఆలోచించి మంచి వ్యక్తిని ఎన్నుకోవాలి
- మాయమాటలు నమ్మి మోసపోవద్దు
- ఎమ్మెల్యే జాజాల సురేందర్
- లింగంపేట మండలంలో ప్రచారం

ఎల్లారెడ్డి, నవంబర్ 21: 'ఓటు ఐదు సంవత్సరాల భవిష్యత్తును నిర్ణయిస్తుంది, మాయ మాటలు నమ్మొద్దు, దయచేసి ఆలోచించి కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలి..' అని ఓటర్లకు సూచించారు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్. లింగంపేట మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. మండలంలోని ప్రతి గ్రామంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయని, అది ముఖ్యమంత్రి కేసీఆర్ నిధులు మంజూరు చేయడంతోనే సాధ్యమైందని అన్నారు. మండలంలోని కోమటిపల్లి గ్రామంలోనే నాలుగు సంవత్సరాల్లో కోటి రూపాయల పనులు చేపట్టామని వివరించారు. ఇప్పుడు వృద్ధులు తీసుకుంటున్న పింఛను ఐదు వేలకు పెరుగుతుందని, రెండు వందల పింఛన్‌ను రెండు వేలకు పెంచిన ముఖ్యమంత్రి రాబోయే రోజుల్లో ఐదు వేలకు పెంచడం ఖాయమని వివరించారు. తెలంగాణ రాకముందు కరెంటు ఎలా ఉందో తెలుసని, ఒకవేళ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ పాత రోజులే వస్తాయని గుర్తు చేశారు. రైతుల కోసం ఉచిత కరెంటు ఇస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం వారికి వెన్నుదన్నుగా నిలుస్తున్నదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మూడు గంటల కరెంటు ఇస్తదని, రైతులు పది హస్సర్ల మోటర్లు పెట్టుకోవాలని చెబుతున్నదని ప్రజలకు వివరించారు. లింగంపేట మండలంలోని ముస్తాపూర్, ఒంటరిపల్లి, సురాయిపల్లి, జగదాంబతండా, కోమట్ పల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే జాజాల ఎన్నికల ప్రచారం నిర్వహించగా అనూహ్య స్పందన లభించింది. ఈ ప్రచార కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

**ఆత్మీయ పలకరింపులు, వృద్ధుల ఆశీర్వాదాలు...**

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఎన్నికల ప్రచారం మంగళవారం ఆత్మీయ పలకరింపులు, వృద్ధుల ఆశీర్వాదాలతో ఆద్యాంతం జోరుగా సాగింది. ప్రతి గ్రామంలో ఆయన ప్రచారం పాదయాత్రతో మొదలై అక్కడి స్థానికులను ఆప్యాయంగా పలుకరించడంతో వారంతా ఆయన వెంటే ఉన్నామని భరోసా ఇచ్చారు. చాలా గ్రామాల్లో 60 ఏండ్లు పైబడిన వారు జాజాల సురేందర్‌ను బాగున్నావా బిడ్డా అంటూ పలుకరించడం కనిపించింది. ప్రతి ఒక్కరి దగ్గరికి వెళ్లి పలుకరించడంతో వారు సంతోషంగా ఆయనను ఆశీర్వదించారు. ప్రచార రథంపై ఉండడం కన్నా ఆయన పాదయాత్ర నిర్వహించడానికే ఇష్టపడ్డారు.



వృద్ధుడిని ఆప్యాయంగా పలుకరిస్తున్న ఎమ్మెల్యే జాజాల



సురేందర్‌కు మద్దతు తెలుపుతున్న వృద్ధులు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేందర్

# బీఆర్ఎస్‌లోకి జోరుగా చేరికలు



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన తిమ్మోజివాడి గ్రామస్తులు



గాంధారి మండలం జువ్వాడి గ్రామస్తులు

గాంధారి/సదాశివనగర్, నవంబర్ 21: గాంధారి మండలంలోని జువ్వాడి గ్రామ మాజీ ఉప సర్పంచులు సంగయ్య, యాదగిరి, ఉప సర్పంచ్ లక్ష్మీపతి, వార్డు సభ్యులు భాస్కర్, మహేందర్, నాయకులు హరికృష్ణ, లక్ష్మయ్య, రాజిరెడ్డి, వడ్ల శ్రీనివాస్‌తోపాటు పలువురు గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. సురేందర్ గెలుపు కోసం కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శంకర్‌నాయక్, నాయకులు శ్యామ్, పెంటయ్య, నర్సింగ్, నెహ్రూ, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ మండలంలోని తిమ్మోజివాడి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ నాయక్, మర్కంటి బుచ్చన్న, సర్పంచ్ పోన్న స్వప్నా శంకర్, ఉప సర్పంచ్ చాకలి రాజయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పోన్న పెద్ద నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఎయిడ్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎన్‌జీవో బాధ్యులు

పిట్లం, నవంబర్ 21: మండలంలోని అన్నారం అంగన్‌వాడీ కేంద్రంలో ఎన్‌జీవో బాధ్యులు మంగళవారం ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సం దర్భంగా వారు రక్త నమూనాలను సేకరించి పరీక్షించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త అనురాధ, ఎన్‌జీవో సభ్యులు రోజా, పరమేశ్వరి, నజియా, ఆశ వర్కర్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 21: నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలో బీజేపీ తరపున ప్రచారం చేస్తున్న కళాకారులపై దాడిచేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గోపాల్‌పేటలోని బస్టాండ్ సమీపంలో బీజేపీ తరపున కళాకారులు ప్రచారం చేస్తున్నారు. ఆ సమయంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇక్కడ ఎందుకు ప్రచారం చేస్తున్నారని దాడి చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు ధనుంజయ్ ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.